ఉన్నత విద్యకు ఊపిరి

- తూతూమంత్రంగా గత పాలనలో ప్రారంభం
- పర్మినెంట్ స్టాఫ్ లేక మూతబడే స్థాయికి చేరిన కళాశాల
- కళాశాలను కొనసాగించాలని మంత్రి రోజాకు విన్నవించుకున్న విద్యార్థులు, అధ్యాపకులు
- నూతన కళాశాల ఏర్పాటుతో పాటు మౌలిక వసతులు సమకూర్చిన మంత్రి
- ఈ నెల 16న పూర్తిస్థాయి సిబ్బంది నియామకం
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు



మంత్రి ఆర్‌కే రోజాకు కళాశాల పరిస్థితిని వివరిస్తున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు (ఫైల్)

నగరి : జూనియర్ కళాశాలలో కోఎడ్యుకేషన్ మాత్రమే ఉండడంతో బాలికలకు విడిగా జూనియర్ కళాశాల ఉంటే వారి అభివృద్ధికి తోడ్పడుతుందని అందుకు అవసరమైన విరాళం తామిస్తామంటూ 20 ఏళ్ల క్రితం మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడకు చెందిన ఎంఎస్.మురుగానందం నాగమ్మాళ్ దంపతులు ముందుకు వచ్చి కళాశాల కోసం రూ.20 లక్షలు విరాళమిచ్చారు. దీంతో 16 ఏళ్ల క్రితం అప్పటి పాలకులు ఎంఎస్ఎంఎన్ బాలికల జూనికర్ కళాశాల అన్న పేరుతో ఎస్‌జీఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోనే రెండు గదుల్లో తూతూమంత్రంగా ప్రారంభించి మమ అనిపించారు. కళాశాలకు అవసరమైన భవనంగానీ, పర్మినెంట్ సిబ్బంది నియామకం గానీ, కార్యాలయ సిబ్బంది నియామం గానీ చేపట్టలేదు. ఆసక్తి లేకుండా ప్రారంభించిన ఈ కళాశాలకు ఆది నుంచి కష్టాలు తప్పలేదు.

తొలుత 67 మంది విద్యార్థినులు మాత్రమే ఈ కళాశాలలో ఇంటర్ విద్య అభ్యసనకు చేరారు. చేరిన వారుకూడా ఎందుకు చేరామా ? అని బాధపడే పరిస్థితి ఎదురైంది. ఆ దశలో గత ప్రభుత్వం నిర్వహించిన నీరుచెట్టులో అక్రమాలను బయటపెట్టడానికి కళాశాలకు వెళ్లిన మంత్రి ఆర్కేరోజాకు విద్యార్థినులు తమ బాధను వివరించారు. తమకు విడిగా బాత్రూమ్‌లు లేవని విన్నవించారు.

అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా..

విద్యార్థుల సమస్యలపై స్పందించిన మంత్రి రోజా నిరుపయోగంగా ఉన్న ఆస్పత్రి భవనాన్ని నవీకరించి బాలికల జూనియర్ కళాశాలకు ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే అప్పటి పాలక ప్రభుత్వం అయిన టీడీపీ అడుగడుగునా ఆ పనులకు అడ్డుపడింది. ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు సన్నాహాలు చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కేసులు కూడా పెట్టారు. అయితే దేనికీ బెదరని మంత్రి ఆర్కేరోజా తాను అనుకున్న పని పూర్తిచేశారు. నిరుపయోగ ఆస్పత్రి భవనాన్ని బాలికల జూనియర్ కళాశాలకు అందించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తప్పక అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 లక్షల నిధులతో రెస్టారూమ్‌లు కట్టించారు. చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసి శుద్ధీకరించిన తాగునీటిని అందించారు. 67 మంది మాత్రమే ఉన్న కళాశాలలో నేడు 350 మంది బాలికలు ఉన్నత విద్యను అభ్యసించే స్థాయికి తీసుకువచ్చారు. అయితే పర్మనెంట్ పోస్టుల నియామకం లేక 16 ఏళ్లుగా కాంట్రాక్టు లెక్చరర్లే నిర్వహిస్తుండడం ఈ కారణంగా వారుకూడా రెగ్యులర్ కాకపోవడంతో కళాశాలను వదలి వేరే కళాశాలకు వెళ్లేందుకు కూడా వారు సిద్ధమయ్యారు. అలా జరిగితే విద్యార్థులు ఉండరని 350 మంది విద్యార్థుల భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని ప్రిన్సిపల్, అధ్యాపకులు మంత్రి రోజాకు విన్నవించుకున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నగరికి విచ్చేసిన సమయంలో ఆయనను కళాశాలకు తీసుకెళ్లిన మంత్రి అక్కడి పరిస్థితిని ఆయన అర్థం చేసుకునేలా చేశారు. అలాగే కమిషనర్ ఆఫ్ ఇంటర్మీడియట్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఫలితంగా జిల్లాలో అదనంగా అధ్యాపక పోస్టులు ఉన్న కళాశాలల నుంచి 7 పర్మినెంట్ అధ్యాపక పోస్టులను నగరి బాలికల జూనియర్ కళాశాలకు కేటాయించడంతో పాటు టైపిస్టు, రికార్డు అసిస్టెంట్, అటెండర్ పోస్టులను కూడా కేటాయించారు. ఈ మేరకు ఈ నెల 16వ తేదీన ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ నుంచి కళాశాలకు ఉత్తర్వులు అందాయి. ఇది అనితరసాధ్యమైన విజయమని కాంట్రాక్టు పోస్టులతోనే కొనసాగాల్సి వస్తుందేమో అన్న పరిస్థితి నేడు మారిందని తాము రెగ్యులర్ అవుతామని, కళాశాల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిన దశలో మంత్రి ఆర్కేరోజా ఊపిరి పోశారని కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు 350 మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేశారని, ఇంతటి కృషిచేసిన మంత్రికి కళాశాల తరపున ధన్యవాదాలు అన్నారు.

క్లుప్తంగా

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సంధ్య

పుత్తూరు: చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు వంటి పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య తెలిపారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కాపు వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శరీరంలో పోషక లోపం రాకుండా తల్లులతో పాటు పిల్లలు పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు మెండుగా ఉన్నాయని తెలిపారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వంట సమయంలో కూరగాయలను నీటితో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో ఒక ఆకుకూర ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లలిత, ఆయా నదియ, తల్లులు పాల్గొన్నారు.

కొండమల్లీశ్వరునికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం : మండలంలోని బీఆర్ఎన్ కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై వెలసిన శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాత సేవతో కొండమల్లీశ్వర స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యం సమర్పించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామివారిని సర్వాంగ సుందరంగా, విశేష అలంకరణతో కొండమల్లీశ్వర స్వామిని ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

చంద్రప్రభ వాహనంపై కరకంతేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షిస్తున్న కరకంతేశ్వరుడు

నగరి : పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంతేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం కరకంతేశ్వర స్వామివారిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక, అర్చనలు నిర్వహించారు. మాడవీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామివారిని భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఆలయం వద్ద భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



మునికృష్ణ (ఫైల్)

శ్రీరంగరాజపురం: ఐచర్ వ్యాన్ ఆటోను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని ఆరిమాకులపల్లి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మంగుంట గ్రామానికి చెందిన మునస్వామి కుమారుడు మునికృష్ణ(37) అలియాస్ ఆటో నాయుడు, అదే గ్రామానికి చెందిన సుభాష్ (44) ఇద్దరు కలసి 49 కొత్తపల్లిమిట్ట నుంచి స్వగ్రామం మంగుంటకు ఆటోలో వెళ్తున్నారు. అదే సమయంలో పుత్తూరు నుంచి చిత్తూరుకు కోళ్లతో వెళ్తున్న ఈచర్ వ్యాను ఆరిమాకులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బస్టాండ్ వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిలో వీరి ఆటోను ఢీకొట్టింది. దీంతో మునికృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి తీవ్రంగా గాయపడిన సుభాష్‌ను 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజకుళ్లాయప్ప కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఈచర్ వ్యాన్ డ్రైవర్ పరారైనట్లు పోలీసులు తెలిపారు.

అభ్యుదయ తత్వం అడిగోపుల కవిత్వం



నిలువెత్తు సంతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, వక్తలు

తిరుపతి కల్చరల్: అడిగోపుల వెంకటరత్నం అనర్గళమైన అభ్యుదయ కవి రత్నమని తెలుగు భాషోద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సాకం నాగరాజు తెలిపారు. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రచయిత అడిగోపుల వెంకటరత్నం రచించిన నిలువెత్తు సంతకం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అంతరాలు, అసమానతలపై అడిగోపుల అసహనం ప్రకటిస్తారని తెలిపారు. మహిళా డిగ్రీ కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షురాలు ప్రేమావతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేశారు. కవిత్వం సమీక్షించడం సులభం కాదని, కవిత్వాన్ని పూర్తిగా అనుభూతి చెందిన తర్వాతే విమర్శ చేయగలమన్నారు. సామాన్యంగా కనిపించే వస్తువును కూడా జిగేలు మనిపించే రసవేది అడిగోపుల వెంకటరత్నం అని తెలిపారు. ఆయన ఇప్పటికి 29 కవితా సంపుటాలు ప్రచురించడం అరుదైన విషయమన్నారు. వెంకటరత్నం కవి మాత్రమే కాదు చిత్రకారుడు కూడా అని కొనియాడారు. కార్యక్రమంలో రచయిత కుమారుడు శ్రీకాంత్, అవధాని ఆముదాల మురళి, పలువురు రచయితలు, కవులు, సాహితీ వేత్తలు టింకాయల దామోదరం, ఆకుల మల్లేశ్వరరావు, ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, నడ్డి నారాయణ, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పుత్తూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు జి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో ఉద్యోగులు కేవలం 50 శాతం మాత్రమే వినియోగించుకోవడం ఆందోళన కలిగించే అంశం అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం ద్వారా యువతకు మార్గదర్శకంగా నిలవాలన్నారు. పుత్తూరు డివిజన్ నుంచి ఇటీవల జిల్లా కమిటీకి నూతనంగా ఎన్నికైన నాయకులు దేవేంద్రయాదవ్, కేశవులు, శ్రీనివాసులురాజు, కోటీశ్వరన్, వాసు, శోభనాదేవి, రవి, చంద్రయ్యను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ధనుంజయనాయుడు, జిల్లా నాయకులు రమేష్‌బాబు, జగన్నాథం, సీనియర్ నాయకులు కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, యుగంధర్, మురళి, మాతయ్య, జయచంద్రారెడ్డి, హేమాద్రి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

పుత్తూరు: పట్టణ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలను ఈనెల 31వ తేదీ లోపు పూర్తిగా చెల్లిస్తే వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తి, ఖాళీ జాగాలకు సంబంధించి ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న పన్ను బకాయిలను పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ మాఫీ అవుతుందని తెలిపారు. పన్ను చెల్లించు వారు మున్సిపల్ కార్యాలయంలోని క్యాష్ కౌంటర్‌లో నేరుగా గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ చెల్లించవచ్చని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు ప్రారంభం

- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్
- పర్యవేక్షించిన ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్



కార్వేటినగరం ఆర్కేఎస్సార్ ఉన్నత పాఠశాల వద్ద పోలీసుల నిఘా



పరీక్షకేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీడీ నెల్లూరు సీఐ శంకర్

కార్వేటినగరం: పదో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉందని, పరీక్ష కేంద్రాల వద్దకు ఎవరూ వెళ్లడానికి వీలు లేదని ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రారంభమైన పది పరీక్ష కేంద్రాలను ట్రైనీ డీఎస్పీ తమ సిబ్బందితో పాటు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలని, ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్న పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లినా, నిబంధనలను ఉల్లఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులను ముందే క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి మాస్‌కాపీయింగ్ జరిగినట్లు సమాచారం అందినా సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామని సూచించారు. నిబంధనల ప్రకారం విదార్థులు ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షలను అనుమతించమని, విద్యార్థులు గుర్తించుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు స్క్వాడ్ అధికారులు రావడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు. ప్రశ్నపత్రాలు బయటకు రాకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు.

గంగాధర నెల్లూరులో..

గంగాధరనెల్లూరు : మండలంలో పదో తరగతి పరీక్ష మూడు సెంటర్లలో సజావుగా జరిగిందని ఎంఈఓ ఆంజనేయులు శెట్టి అన్నారు. తెలుగు పరీక్షకు 625 విద్యార్థులకు గానూ 615 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 10 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలకేంద్రంలోని పాలసముద్రం ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి తెలుగు పబ్లిక్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డిపార్టుమెంట్ ఆఫీసర్ వి.యువరాజ్ తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : మండలంలో పదోతరగతి పరీక్షలు 49 కొత్తపల్లిమిట్ట, శ్రీరంగరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ అరుణాచలంరెడ్డి తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా 144 సెక్షన్ భద్రత నడుమ పరీక్షలు ప్రారంభమైనట్లు చెప్పారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 376 మందికి గాను 374 మంది పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు.

నింద్రలో..

నింద్ర: మండలంలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నింద్ర ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాసే విద్యార్థులను పోలీసులు తనిఖీలు చేసి లోపలకు పంపించారు. మొత్తం 178 మంది విద్యార్థులకు 175 మంది హాజరు కాగా ముగ్గురు హాజరు కాలేదని పరీక్షల చీఫ్ అమరనాథ్‌రెడ్డి తెలిపారు.

నగరిలో..

నగరి : నగరి మున్సిపల్ పరిధిలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఏకాంబరకుప్పం జెడ్పీహెచ్ఎస్‌లో, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో, సత్రవాడ, ఏకాంబరకుప్పం, పుదుపేట జెడ్పీహెచ్ఎస్‌లలో, మండలంలోని తడుకుపేట జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 1193 మంది విద్యార్థులకు గానూ 1190 మంది హాజరుకాగా ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రతి సెంటర్ వద్ద పోలీసులు, వైద్యసిబ్బంది, ప్రత్యేక స్క్వాడ్ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



పాలసముద్రం: విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న టీచర్లు



నింద్ర పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



నగరి : పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

నా ప్రతి అడుగూ ప్రజల కోసమే..



జగనన్న లేఅవుట్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి పూలమాల వేసి అభినందిస్తున్న మహిళలు

- సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలి
- జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పథంలో నడిపించిన తన తండ్రి డిప్యూటీ సీఎం కె.నారాయణ స్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తానని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి తెలిపారు. సోమవారం పాలసముద్రం, బాలకృష్ణాపురం, తిరుమళరాజుపురం, గంగమాంబపురం, నరసింహపురం పంచాయతీల్లో జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసి యాదవ్, నాయకులతో కలిసి పర్యటించారు. ప్రతి పంచాయతీలో ప్రజలు ఆమెకు మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికా రు. అనంతరం ఆమె ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మీ ఇంటి బిడ్డగా భావించి వచ్చే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కొనసాగాలంటే రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవల్సిన అవసరం మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ పోలయ్య, సర్పంచ్ అయ్యప్ప, జీవిత, సీఖ, నాయకులు చంద్రశేఖర్‌రాజు, సుందరరాజు, నరసింహనాయుడు, షణ్ముగ రెడ్డి, కృష్ణయ్య, సుబ్రమణ్యరాజు, భాస్కర్, చిన్నపయ్యన్, తిరుమల, గోవిందస్వామి, రవిరెడ్డి, లక్ష్మణన్, త్యాగరాజ్, గోపాల్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



చంద్రన్‌కు నివాళులర్పిస్తున్న సెల్వమణి



కుప్పస్వామికి నివాళులర్పిస్తున్న సెల్వమణి



బాధిత కుటుంబ సభ్యులకు, పార్టీ నాయకులకు ధైర్యం చెబుతున్న సెల్వమణి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి భరోసా ఇచ్చారు. గేట్‌పుత్తూరులోని న్యూవీవర్స్ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పి.ఆర్.చంద్రన్(39) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సెల్వమణి వారి ఇంటికి వెళ్లి చంద్రన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు. కుటుంబ సభ్యులకు రూ.10 ఆర్థిక సాయం అందజేశారు. దాసరిగుంట వీధిలో సీనియర్ నాయకుడు డి.పి.కుప్పుస్వామి మృతి చెందగా ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రన్, దిలీప్, ఏకాంబరం, ఏలుమలై, గోపి, తిరునావకర్సు, పొన్నుస్వామి, సుందరం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం



పుష్పయాగంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి



పుష్పయాగాన్ని తిలకిస్తున్న డిప్యూటీ ఈఓ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధంగా ఉన్న శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు. ముందుగా వివిధ రకాల పుష్పాలను గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా ఆలయానికి తీసుకొచ్చారు. పుష్పపాన్పుపై స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను చేర్చి అర్చకులు పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పుష్పయాగాన్ని తిలకించారు. కార్యక్రమంలో తితిదే డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, శ్రీకాళహస్తీశ్వరాలయం పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, కందాటి శేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

డాక్టర్ మురళీ సేవలు మరువలేనివి



పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ మురళిని సన్మానిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: ప్రభుత్వ అధికారులు ప్రజలు అభినందించేలా సేవలు చేయాలని, అప్పుడే అధికారులకు ప్రజల నుంచి గుర్తింపు లభిస్తోందని ఎంపీపీ లత అన్నారు. సోమవారం కార్వేటినగరం సీహెచ్‌సీ నుంచి శ్రీకాళహస్తి ఆస్పత్రికి సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై శ్రీకాళహస్తికి వెళ్లిన డాక్టర్ మురళీకుమార్‌ను ఎంపీపీ లత, వైద్యాధికారులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ లత మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నవారిని ప్రజలు దేవుడిగా భావిస్తారని, అలాంటి వారు రోగులకు స్నేహభావంతో మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అలాంటి కోవకు చెందిన డాక్టర్ మురళీ సీహెచ్‌సీ నుంచి పదోన్నతిపై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వైద్యసిబ్బందికి మార్గదర్శకంగా ఉంటూ రోగులతో స్నేహ భావంతో మెలుగుతూ వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ మురళీకి పదోన్నతి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలువురు వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడారు. ఈ క్రమంలో భాగంగా పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ మురళీకి పుష్పగుచ్ఛాలు అందించి శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, స్థానిక సర్పంచ్ ధనుంజయవర్మ, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ యూసఫ్, డాక్టర్ కీర్తి, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ శృతిభాగ్యం, పర్యవేక్షకులు అంబరీష్‌రాజు, వైద్యసిబ్బంది పలువురు పాల్గొన్నారు.